సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 9 । మే । 2025



టన్ను చీనీ రూ.24 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.3,100 ప్రకారం ధర పలికాయి.



బాబుపై గురువుల గుర్రు

ఐఆర్, పీఆర్సీ, పెండింగ్ డీఏలపై ఉపాధ్యాయులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. 12న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నారు.

10లో

గరిష్టం/కనిష్టం
38.7°/21.9°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎయిడ్స్ నియంత్రణకు కళాజాత బృందాలు



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచడానికి కళాజాత బృందాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం పేర్కొన్నారు. గురువారం స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద కళాజాత బృందాల కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. డీఎల్ ఏటీఓ డాక్టర్ తిప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో గురువారం నుంచి 29 వరకూ సుమారు 20 రోజుల పాటు వీధి నాటకాలు ఏర్పాటు చేసి ఎయిడ్స్, హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కొత్తచెరువు నెహ్రూ కూడలిలో కళాజాత బృందం నాటకాన్ని ప్రదర్శించింది.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు



గాయపడిన కారేశప్ప

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు గ్రామంలో కారేశప్ప అనే వ్యక్తి ఎలుగు బంటి దాడిలో గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే .. గురువారం ఉదయం కారేశప్ప బహిర్భూమి కోసం బయటకు వెళ్లాడు. అటవీ ప్రాంతంలో నుంచి ఆహారం వెతుక్కుంటూ ఓ ఎలుగుబంటి ఊరి వైపు వచ్చింది. ఈ సమయంలోనే కారేశప్పపై ఎలుగుబంటి దాడి చేసింది. వెంటనే కారేశప్ప కేకలు వేయడంతో ఎలుగుబంటి అటవీ ప్రాంతం వైపు పరుగులు తీసింది. గాయపడిన కారేశప్పను కుటుంబ సభ్యులు గుడిబండ ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు.

రూ.5 లక్షలు ఇవ్వు .. లేదా ఊరు విడిచి వెళ్లిపో

- కిరాణా వ్యాపారిని బెదిరించిన బీజేపీ నాయకులు

ధర్మవరం అర్బన్: ''మాకు రూ.5 లక్షలు ఇవ్వాలి. లేకపోతే ఈ ఊరు విడిచి వెళ్లిపోవాలి'' అంటూ ఓ కిరాణా వ్యాపారిని బెదిరించిన బీజేపీ నేతలు... చివరకు కిరాణా షాపులోకి చొరబడి రూ.3 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన గురువారం ధర్మవరంలో చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని సాయినగర్‌కు చెందిన కిరాణా వ్యాపారి వెంకటరమణ దుకాణం వద్దకు గురువారం బీజేపీ నాయకుడు సీసీ కొత్తకోట రవీంద్రరెడ్డి అనుచరులు భాస్కర్‌రెడ్డి, లచ్చి వచ్చారు. తమకు రూ.5 లక్షలు ఇవ్వాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇదే సమయంలో సీసీ కొత్తకోట రవీంద్రరెడ్డి కూడా ఫోన్ చేసి వ్యాపారిని బెదిరించారు. అయినా వ్యాపారి లెక్కచేయకపోవడంతో భాస్కర్‌రెడ్డి, లచ్చి... కిరాణ దుకాణంలో చొరబడి రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు వెంకటరమణ ధర్మవరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బీజేపీ నాయకుడు సీసీ కొత్తకోట రవీంద్రరెడ్డి, అతని అనుచరులు భాస్కర్‌రెడ్డి, లచ్చిలపై కేసు నమోదు చేశామని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

పనులు సత్వరమే పూర్తి చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణకు పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్ హెచ్ 342, ఎన్‌హెచ్ 716జీ జాతీయ రహదారులు, భూసేకరణకు సంబంధించిన పనుల పురోగతిపై సంబంధితశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నాటికి జాతీయ రహదారుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓలు సువర్ణ, శర్మ, ఎన్‌హెచ్ఏఐ పీడీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేపట్టొద్దు' అని యావత్తు ఉమ్మడి జిల్లా రైతాంగం ముక్త కంఠంతో నినదిస్తున్నా చంద్రబాబు సర్కారు ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు సంఘాలు, వివిధ పార్టీల నాయకులు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా, భవిష్యత్తులో భూగర్భ జలాలు మరింత కనిష్ట మట్టానికి పడిపోతాయని మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కాసుల కక్కుర్తితోనే రైతుల ఆవేదనను గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కాలువ పనుల్లో కాసుల వరద

ఆత్మకూరు సమీపంలో జరుగుతున్న హంద్రీ–నీవా లైనింగ్ పనులు



లైనింగ్.. దోపిడీకి టెండరింగ్

- హంద్రీ–నీవా లైనింగ్ పనుల్లో కాంట్రాక్టర్లకు డబ్బే డబ్బు
- కాంట్రాక్టు సంస్థల నుంచి నేతలకు భారీగా ముడుపులు!
- నాసిరకంగా పనులు జరుగుతున్నా కన్నెత్తి చూడని అధికారులు

అనంతపురం సెంట్రల్: ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నీటి అవసరాలు బాగా పెరిగాయి. 80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడ్డారు. భవిష్యత్‌లో పారిశ్రామికంగా కూడా మరింతగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందే అవకాశముంది. ఈ సమయంలో ఏ ప్రభుత్వమైనా తక్కువ సమయంలో ఎక్కువ నీటిని తీసుకొచ్చే పనులకు శ్రీకారం చుడుతుంది. కానీ చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా హంద్రీ–నీవా కాలువకు సిమెంట్ పూతలు పూసే పనులకు తెరలేపింది.

స్వలాభం కోసమే..

హంద్రీనీవా ఫేజ్–2 కింద 7 ప్యాకేజీల్లో లైనింగ్ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం రూ. 936 కోట్లు వెచ్చిస్తున్నారు. లైనింగ్ పనులకు టెండర్లు ఈ ఏడాది మార్చిలో ఖరారయ్యాయి. ఏప్రిల్ నుంచి పనులు చేపడుతున్నారు. జూన్ 10 నాటికే పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ క్రమంలో వేగంగా పూర్తి చేయాలనే నెపంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. పనుల నాణ్యతను ఇంజినీర్లు ఎవరూ పరిశీలించే సాహసం చేయడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వలాభం కోసమే హంద్రీ–నీవా లైనింగ్ పనులకు తెర తీశారని, టీడీపీ ముఖ్య నేతలకు భారీగా ముడుపులు అందాయని, దీంతోనే ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అందుకే... 'లైనింగ్ పనులు వద్దు మొర్రో' అని రైతులు గగ్గోలు పెడుతున్నా పెడచెవిన పెడుతున్నట్లు పలువురు చెబుతున్నారు. కేవలం నీటిని తన సొంత నియోజకవర్గం కుప్పానికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో లైనింగ్ పనులు చేపడుతూ, తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఉమ్మడి జిల్లా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ కుటుంబంతోనే హంద్రీనీవాకు జీవం..

2004కు ముందు ఉమ్మడి అనంతపురం జిల్లా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను చూసింది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ ప్రాంత పరిస్థితులను చూసి చలించిపోయారు. హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేయాలని తలచి.. అప్పటివరకూ తాగునీటి పథకంగా శిలాఫలకానికే పరిమితమైన 'హంద్రీ–నీవా'ను తాగు,సాగునీటి ప్రాజెక్టుగా మార్చి 2009 నాటికే మొదటి దశ పనులను పూర్తి చేశారు. రెండో దశ పనులు కూడా 60 శాతం పూర్తయ్యాయి. ఆయన చలువతో 2012 నుంచి హంద్రీ–నీవా ద్వారా రాయలసీమ జిల్లాలకు సాగునీరు అందుతున్నాయి. ఇక.. వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీ–నీవాను మరింత బలోపేతం చేయాలని సంకల్పించారు. ప్రస్తుతం 2,200 క్యూసెక్కుల నీటిని మాత్రమే తీసుకోగలుతున్నామని, దీన్ని 6,300 క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయం తీసుకోవడమే కాకుండా తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రూ. 6,182 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అయితే, ఆ క్రమంలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా పరిస్థితి తలకిందులైపోయింది.



లైనింగ్ పనులు ఆపాలంటూ ఆందోళన చేస్తున్న జలసాధన సమితి నాయకులు (ఫైల్)

హంద్రీ–నీవా ప్రాజెక్టు వివరాలు..

మొత్తం ఆయకట్టు	6.02 లక్షల ఎకరాలు
ప్రస్తుతం కాలువ ప్రవాహ సామర్థ్యం	2,200 క్యూసెక్కులు
జగన్ హయాంలో నిర్ణయం మేరకు పెరగాల్సిన సామర్థ్యం	6,300 క్యూసెక్కులు
చంద్రబాబు ప్రభుత్వం పరిమితం చేసింది	3,850 క్యూసెక్కులు

జూన్ 10 నాటికి పనులు పూర్తి

హంద్రీ–నీవా లైనింగ్ పనులు జూన్ 10 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పనులు పరిశీలించేందుకు ఉరవకొండ నియోజకవర్గం ఛాయాపురానికి నేడు సీఎం వస్తున్నారు. అక్కడ గ్రామ సభ నిర్వహిస్తారు. అనంతరం లైనింగ్ పనులపై హంద్రీ–నీవా అధికారులతో సమీక్షిస్తారు. జిల్లాలో పనులు అన్నిచోట్లా ప్రారంభమయ్యాయి.

– నాగరాజ, సీఈ, జలవనరులశాఖ

బీసీ మహిళల స్కీంలో మంత్రి సవిత స్కాం



మాట్లాడుతున్న టీఎస్ దీపిక

- రూ.76 కోట్లతో ముగిసే స్కీంను రూ.257 కోట్లకు పెంచి అవినీతి
- మంత్రి సవితపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్ దీపిక ఆగ్రహం

చిలమత్తూరు: బీసీ సంక్షేమశాఖామంత్రి సవిత మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని బీసీ మహిళలను మోసం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక విమర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డితో పాటు నాయకులతో కలిసి హిందూపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. దీపిక మాట్లాడుతూ కుట్టు మిషన్ల పేరుతో సీఎం చంద్రబాబు, మంత్రి సవిత ఉమ్మడిగా మహిళలకు కుచ్చుటోపీ పెట్టారన్నారు. స్కీం బడ్జెట్ అమాంతం పెంచి సుమారు రూ. 150 కోట్లు నొక్కేసేందుకు స్కెచ్ వేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం టెండర్లకు ఆహ్వానించగా 65 కంపెనీలు బిడ్ వేశాయని అయితే ఇందులో 56 సంస్థలను ముందుగానే తిరస్కరించి రాజకీయానికి తెరతీశారన్నారు. మిగిలిన 9 సంస్థల్లో టెండర్లు తెరవకముందే ఆరింటిని తొలగించి చివరకు మూడు కంపెనీలు మిగిలేలా చేశారన్నారు. వాటిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీటెక్నాలజీస్ వారు రూ. 21,798 తక్కువ కోట్ చేసి ఎల్1 గా నిలవగా, ఎల్ 2, ఎల్3 గా హైదరాబాద్‌కు చెందిన మరో రెండు సంస్థలు నిలిచాయన్నారు. అయితే ఎల్1కి కేవలం 5 శాతం పని మాత్రమే అప్పజెప్పి మిగిలిన రెండు సిండికేట్ కంపెనీలకు 95 శాతం పనులు అప్పగించారన్నారు. మార్చి 8న పథకాన్ని ప్రకటించగా 90 రోజులు శిక్షణ కాలంలో ఇప్పటికే 50 రోజులు పూర్తి కావొచ్చినా నామమాత్రంగా శిక్షణ ఇచ్చి మొత్తానికే ఎసరు పెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం రూరల్ మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, నిస్సార్ అహ్మద్, శివశంకర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



భద్రతా ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, చిత్రంలో ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా పుట్టపర్తి విమానాశ్రమయంలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజర్ (ఏఎస్ఎల్) ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న అధికారులకు ఆదేశించారు. గురువారం స్థానిక విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు పనులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించేందుకు సీఎం వస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి 10.50 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారన్నారు. విమానాశ్రయం నుంచి 10.55 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఉరవకొండకు బయలుదేరి వెళ్తారని తెలిపారు. పర్యటన ముగించుకొని తిరిగి సీఎం చంద్రబాబు మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్ ద్వారా తిరిగి పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3.10 గంటలకు బెంగళూరు విమానాశ్రయం చేరుకుంటారన్నారు. భద్రత విషయంలో లోటుపాట్లు లేకుండా అధికారులందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. డీఎస్పీలు విజయకుమార్, నరశింగప్ప, శివన్నారాయణస్వామి, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఐలు మహేష్, వలితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తిలో ట్రాఫిక్ ఆంక్షలు..

సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కదిరి, ముదిగుబ్బ నుంచి వచ్చే వాహనాలు కర్ణాటక నాగేపల్లి, గణేష్ సర్కిల్ నుంచి బ్రాహ్మణపల్లి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మీదుగా ,అలాగే కమ్మవారిపల్లి నుంచి వచ్చే వాహనాలు బైపాస్ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోనున్నారు. కొత్తచెరువు,గోరంట్ల మీదుగా వచ్చే వాహనాలు మామిళ్లకుంట క్రాస్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, బీడుపల్లి, క్రాస్, బ్రాహ్మణపల్లి, ఎనుములపల్లి చిత్రావతి బైపాస్ మీదుగా వాహనాలు మళ్లించనున్నారు.

ప్రజల గొంతుకను నొక్కుతారా?





హిందూపురంలో మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు



పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓకు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

సాక్షిబృందం: కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా కథనాలు కనిపిస్తే చాలు తట్టుకోలేకపోతున్నారు. కక్షసాధింపులకు దిగుతూ జర్నలిస్టులను వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎలాంటి నోటీసులు లేకపోయినా సోదాల పేరుతో పోలీసులు గురువారం ఉదయం 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి ఇంటికి వెళ్లి సోదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని హరించేలా వ్యవహరించిన ప్రభుత్వ తీరును జర్నలిస్టు సంఘాలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేశారు.

సోదాలు హేయం



సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో సోదాలు చేయడం సరికాదు. పత్రికల్లో వచ్చిన వార్తలపై పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం పాత్రికేయుల నైతిక బలాన్ని హరించడమే. కోర్టులో కేసు నడుస్తుండగా ఎలాంటి నోటీసులు లేకుండా సోదాలు చేయడం హేయం. ప్రజాస్వామ్య వాదులందరూ కూటమి ప్రభుత్వ చర్యలు ఖండించాలి. – ఆదినారాయణ, జాప్ జిల్లా అధ్యక్షుడు

మీడియా స్వేచ్ఛను హరిస్తారా?



నిబంధనలు పాటించకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటికి పోలీసులు వెళ్లి భయభ్రాంతులకు గురి చేయడం దారుణం. ప్రజాస్వామ్యంలో ఇది మీడియాకు గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యవాదులు మీడియా స్వేచ్ఛను కోరుకునే వారు సోదాలను ఖండించాలి. – పుల్లయ్య, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకీపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం పల్లకీలో కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో చెన్నకేశవునికి అడుగడుగునా భక్తులు హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి చెన్నకేశవులు జ్ఞాపకార్థం కుమారుడు ప్రసాద్, సోలిగాళ్ల బాలకృష్ణ జ్ఞాపకార్థం సోలిగాళ్ల వెంకటేషు ఉభయదాతలుగా వ్యవహరించారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు



సేకరించిన నేత్రాలను అప్పగిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు



అన్నం వెంకట నారాయణ (ఫైల్)

ధర్మవరం అర్బన్: నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపును అందించవచ్చని విశ్వదీప సేవా సంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన అన్నం వెంకటనారాయణ (80) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విశ్వదీప సేవా సంఘం సభ్యులు మృతుని కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు నేత్రదానానికి అంగీకరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, భాస్కర్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కంటి వైద్యులు డాక్టర్ నరసింహులు మృతుని నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుమారులు అన్నం లోకేష్, సోమశేఖర్, మనవడు అనంతసాగర్‌లకు సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేత్రాలు మరో ఇద్దరికి చూపును అందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వదీప సేవా సంఘం అధ్యక్షుడు గాజుల సురేష్, వైస్ ప్రెసిడెంట్ టి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీజీ హట్టిలో మళ్లీ అతిసారం కేసులు

- 9 మందికి చికిత్స అందిస్తున్న వైద్యులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఎం, డీఐఓ

రొళ్ల: మండల పరిధిలోని జీజీ హట్టి గ్రామంలో అతిసారం అదుపులోకి రావడం లేదు. ఐదు రోజులుగా దాదాపు 35 మంది అస్వస్థతకు గురవగా.. అమూల్య (11) మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. గురువారం కూడా చిన్నారులు దర్శన్, వందన, దొడ్డపూజారప్ప గారి మారన్న, కాడమ్మతో పాటు ఈరమ్మ, అశ్విని, భాగ్యమ్మ, లోకేష్, చిక్కీరప్ప అతిసారం బారిన పడ్డారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్న కూడా అతిసార మాత్రం తగ్గుముఖం పట్టలేదు. చిక్కీరప్ప హిందూపురం, ఈరమ్మను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దర్శన్, వందన, దొడ్డపూజారప్ప గారి మారన్న, కాడమ్మతో పాటు అశ్విని, లోకేష్ రొళ్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, డీఐఓ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్లు హర్షమిత్ర, సౌందర్య, ఎపిడమాలజిస్ట్ బాలాజీ తదితరులు గ్రామంలో పర్యటించి పలు సూచనలు చేశారు. నీటి సంపులు, డ్రమ్ములో నిల్వ ఉంచిన నీటిని శుభ్రం చేసుకోవాలన్నారు. అతిసార వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని తెలియజేశారు.

రూ.3 లక్షల వరకు ఏపీజీబీ పంట రుణాలు

- ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంకు ఆర్ఎం శ్రీదేవి



అనంతపురం అగ్రికల్చర్: రైతులకు రూ.3 లక్షల వరకు పంట రుణాలు ఇస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (పూర్వ ఏపీజీబీ) రీజనల్ మేనేజర్ పి.శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా తమ బ్యాంకు శాఖల్లో పంట రుణాల రెన్యువల్స్, కొత్త రుణాల పంపిణీ జరుగుతోందన్నారు. ఎలాంటి మార్ట్‌గేజ్ లేకుండా పంటలను బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా రూ.3 లక్షల వరకు పంట రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఇపుడు ఏపీజీబీ శక్తివంతంగా మారిందన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. డిపాజిట్లపై 7.6 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.1 శాతం వడ్డీ రేటు వర్తింపజేశామన్నారు.

బాబుపై గురువుల గుర్రు

- ఎన్నికల వేళ అయ్యవార్లకు వరాల జల్లు
- అధికారం చేపట్టిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు గాలికి
- ఐఆర్, పీఆర్సీ, పెండింగ్ డీఏల ఊసెత్తని కూటమి సర్కారు
- నేడు కలెక్టరేట్ ఎదుట నిరసనకు ఏపీటీఎఫ్ పిలుపు
- 12న డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ధర్నా



డిమాండ్ల సాధనకు కదిరిలో ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు (ఫైల్)

కదిరి: 'ఏరు దాటేదాక ఓడ మల్లన్న..ఏరు దాటాక బోడి మల్లన్న' అనే చందంగా సీఎం చంద్రబాబు వ్యవహారశైలి ఉందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు తమను ఆశల పల్లకీలో విహరింపజేశారని, అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్న నేటికీ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నోరు మెదపడం లేదని ధ్వజమెత్తారు.

గొంతెమ్మ కోర్కెలేవీ కోరలేదు..

తమకు న్యాయబద్ధంగా అందాల్సిన ఐఆర్, పీఆర్సీ, పెండింగ్ డీఏలను మాత్రమే అడుగుతున్నామని, అంతకు మించి ఎలాంటి గొంతెమ్మ కోర్కెలు, బోనస్‌లూ అడగడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 11 నెలల కాలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు జీతాలు ఇవ్వడం మినహా ఇంకెలాంటి ఆర్థిక ప్రయోజనం చేకూర్చలేదని మండిపడ్డారు. విడుదల చేసిన నిధుల్లో రూ2,300 కోట్లు సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్‌కే సరిపోయిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, పీఎల్ఎస్‌లు విడుదల చేయడం తప్ప ఐఆర్, పీఆర్‌సీల ఊసెత్తడం లేదని, ఉద్యోగ విరమణ చేసిన వారికి న్యాయంగా అందాల్సిన డబ్బులు కూడా ఈ ప్రభుత్వం చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకొస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు స్పష్టమైన హామీనిచ్చారని గుర్తు చేశారు. దీనిపై బాబు సర్కారు నేటికీ నోరు మెదపడం లేదన్నారు.

ప్రభుత్వం మెడలు వంచేందుకు పోరుబాట..

అలవిగాని హామీలతో ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిన కూటమి సర్కార్ మెడలు వంచేందుకు ఉద్యమ కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. సీపీఎస్ రద్దు కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 9న (నేడు) ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే ఈ నెల 12న జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నాకు యూటీఎఫ్ పిలుపునిచ్చింది. అలాగే ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా డీఈఓ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు

ఉపాధ్యాయుల డిమాండ్‌లు కొన్ని..

- కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పినట్లు 117 జీఓను తక్షణం రద్దు చేయాలి.
- ఫౌండేషన్ స్కూళ్ల ఆలోచన మానుకోవాలి.
- ప్రస్తుతమున్న 1 నుంచి 5వ తరగతి వరకూ ప్రాథమిక పాఠశాలలు, 1 నుంచి 8వ తరగతి వరకూ ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలు, 1 నుంచి 5 వరకు ఉన్న మోడల్ ప్రైమరీ స్కూళ్లు, 6 నుంచి 10 వరకు ఉన్న ఉన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి.
- ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు, 12వ పీఆర్సీ, 3 డీఏలు తక్షణం విడుదల చేయాలి.
- సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలి.
- పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, బదిలీలు, పదోన్నతుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి.

ఇచ్చిన హామీలు నెరవేర్చండి



ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి నేతలు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ప్రభుత్వం తక్షణం స్పందించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆగ్రహం చవిచూడక తప్పదు.

– డా.వి.వి.రమణారెడ్డి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు

పోరుబాటకు సిద్ధంకండి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత బకాయిలు వెంటనే చెల్లించాల్సి ఉంది. దాదాపు ఏడాది కావస్తున్నా దీనిపై ఎలాంటి స్పందన లేదు. మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఐఆర్, పీఆర్సీ ఊసే లేదు. న్యాయపరమైన డిమాండ్ల సాధనకు పోరాటాలకు సిద్ధంకండి.

– జి.హరిప్రసాద్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: రైతు ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేసి వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ముదిగుబ్బ, బత్తలపల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు జాతీయ అవార్డుకు ఎంపికయ్యాయి. గురువారం న్యూఢిల్లీలోని నాఫెడ్ కార్యాలయంలో ఆయా సంఘాల చైర్మన్లకు అవార్డులు అందజేశారు. నాఫెడ్ ఎండీ దీపక్ అగర్వాల్ చేతుల మీదుగా ముదిగుబ్బ ఎఫ్‌పీఓ చైర్మన్ , సీఈఓ చంద్రమోహన్, సతీష్ బత్తలపల్లి ఎఫ్‌పీఓ చైర్మన్, సీఈఓ కరుణాకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌లకు అవార్డులను అందజేశారు. సంఘాల నిర్వహణ, నాయకత్వం, వ్యాపార టర్నోవర్, ప్రభుత్వ సంస్థలతో అనుసంధానం వంటి వాటిలో ప్రగతి సాధించినందుకు ఈఅవార్డులను అందజేశారు. దేశ వ్యాప్తంగా 1280 సంఘాలు ఉండగా అందులో 12 సంఘాలను ఎంపిక చేసినట్లు చెప్పారు.

వివాహిత అనుమానాస్పద మృతి

రొద్దం: మండలంలోని శ్యాపురం గ్రామ సమీపంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని హుసేన్‌పురం గ్రామానికి చెందిన చెన్నకేశవులు భార్య గాయత్రి (29)రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. గురువారం శ్యాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించడంతో గమనించిన పశువుల కాపరుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని ఆత్మహత్య చేసుకున్నది గాయత్రినేనని నిర్ధారించారు. దుస్తులపై రక్తపు మరకలు ఉండడంతో ఆమె మృతిపై తల్లి మంజులమ్మ అనుమానాలు వ్యక్తం చేశారు. తన కుమార్తె మృతికి భర్త చెన్నకేశవులు, ఆయన కుటుంబసభ్యులే కారణమంటూ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బైక్‌పై నుంచి కిందపడి వృద్ధురాలు..

బత్తలపల్లి: ద్విచక్ర వాహనంపై నుంచి అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సాకే పెద్దక్క (76) బుధవారం మధ్యాహ్నం గ్రామంలోని స్టోర్ వద్దకెళ్లి బియ్యం తీసుకుంది. అనంతరం వరుసకు మనువడైన సాకే హరీష్‌తో కలసి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమైంది. హరీష్ అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో వెనకాల కూర్చొన్న పెద్దక్క.. గ్రామ సమీపంలోకి చేరుకుంటుండగా కళ్లు తిరిగి రోడ్డుపై పడిపోయింది. గమనించిన అదే కాలనీకి చెందిన వారు ఆమెను వెంటనే అంబులెన్స్‌లో బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. ఇద్దరి దుర్మరణం

- మృతులు బిహార్ వలస కార్మికులు

రొద్దం: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో బిహార్‌కు చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. మరోఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. బిహార్‌కు చెందిన రాహుల్ (20), మహమ్మద్ సుబహాన్ (40) బతుకు తెరువు కోసం వలస వచ్చి రొద్దంలో స్థిరపడ్డారు. వీరిలో స్థానికంగానే ఓ వెల్డింగ్ షాప్‌లో రాహుల్, ఎస్టేట్‌లో మహమ్మద్ సుబహాన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం లక్నానిపల్లిలో వెల్డింగ్ పనులు ముగించుకుని రొద్దం వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా... కల్లుకుంట క్రాస్ వద్ద నల్లూరు వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఘటనలో బిహారీలు ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మహమ్మద్ సుబహాన్ కుమారుడితో పాటు మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా పెనుకొండలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై రొద్దం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీ – వ్యక్తి మృతి



ఆదినారాయణ (ఫైల్)

కదిరి అర్బన్: కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు... కదిరి మండలం కాళసముద్రం గ్రామానికి చెందిన నాగలక్ష్మి, తన కుమారుడు ఆదినారాయణ (35)తో కలసి గురువారం ఉదయం కదిరికి బేల్దారి పనుల కోసం వచ్చారు. పని ముగించుకుని రాత్రికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. కాళసముద్రం సమీపంలోని గురుకుల పాఠశాల వద్దకు చేరుకోగానే జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగలక్ష్మి, ఆదినారాయణను స్థానికులు కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆదినారాయణ మృతి చెందినట్లు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉన్న నాగలక్ష్మికి ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటనపై కదిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అట్రాసిటీ కేసు నమోదు

పెనుకొండ: కులం పేరుతో దూషణకు పాల్పడిన పెనుకొండకు చెందిన కృష్ణారావు, ఆయన భార్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. గతంలో డబ్బు తీసుకుని రొద్దం మండలం లోచర్లకు చెందిన ముత్యాలప్పకు భూమి విక్రయించిన కృష్ణారావు.. తిరిగి ఆ భూమిని ఇతరులకు విక్రయించాడన్నారు. దీంతో ఆయన ఇంటి వద్దకెళ్లి తనకు న్యాయం చేయాలని ముత్యాలప్ప కోరడంతో కృష్ణారావుతో పాటు ఆయన భార్య లీలమ్మ కులం పేరుతో దూషణలకు పాల్పడ్డారన్నారు. దీంతో బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రైతు ప్రాణం బలిగొన్న రెవెన్యూ నిర్లక్ష్యం

- మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



తహసీల్దార్ శోభాసువర్ణమ్మతో మాట్లాడుతున్న మృతుడి కుటంబ సభ్యులు

తనకల్లు: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే తన తండ్రి ప్రాణాలు బలిగొందంటూ రైతు శంకర్ నాయక్ కుమారుడు రమేష్ నాయక్ ఆరోపించాడు. తన తండ్రి మృతదేహంతో గురువారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టాడు. తనకల్లు మండలం రామ్లానాయక్‌తండాకు చెందిన శంకర్‌నాయక్ ఐదు రోజుల క్రితం విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తీసుకుని నేరుగా తనకల్లులోని తహసీల్దార్ కార్యాలయానికి బాధిత కుటుంబసభ్యులు చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మృతుడి కుమారుడు రమేష్‌నాయక్ మాట్లాడుతూ.. తమకు తండాలో ఐదు ఎకరాల డీకేటీ భూమి ఉందని, అందులో రెండు ఎకరాలను తండ్రి శంకర్‌నాయక్ తన చెల్లెలికి ఇచ్చాడని గుర్తు చేశాడు. ఆ తర్వాత తన నాన్నకు కూడా తెలియకుండా మొత్తం ఐదు ఎకరాలకు మేనత్త, ఆమె భర్త కలిసి పట్టా చేయించుకున్నారని తెలిపాడు. అప్పటి నుంచి తమ భూమి తకు ఇప్పించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో 21 సార్లు తన నాన్న వినతిపత్రాలను అందజేశారని వివరించాడు. అయినా న్యాయం చేకూరకపోవడంతో ఇక తమకు భూమి దక్కదనే మనస్తాపంతోనే తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు వాపోయాడు. ఆందోళన కారులతో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ మాట్లాడారు. జరిగిన అన్యాయంపై విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా నివ్వడంతో ఆందోళనను విరమించారు.

దర్గా ఇనామ్ భూమిని స్వాధీనం చేసుకోవద్దు

సోమందేపల్లి: బయో ఇంధనం ఉత్పత్తికి సంబంధించి సోమందేపల్లి మండలం తుంగోడు గ్రామం వద్ద సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు భూసేకరణకు అధికారులు ప్రతిపాదించిన భూమి పెనుకొండ బాబయ్య స్వామి దర్గా ఇనామ్ కిందకు వస్తుందని, ఈ భూమిని స్వాధీనం చేసుకోరాదంటూ అధికారులకు సయ్యద్ రసూల్ విన్నవించారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల ప్రకారం తుంగోడు గ్రామ సర్వే నెంబరు 28లో 985 ఎకరాలు ప్రభుత్వ భూమిగా ఉందని పేర్కొన్నారు. ఆ స్థలం సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉండడంతో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. అయితే సదరు భూమి బాబయ్య స్వామి దర్గా మాన్యంకు సంబంధించి ఇనామ్ భూమిగా జాగీర్దార్‌లు రికార్డులు చూపుతున్నారని, దీనిపై విచారణ చేపడతామని పేర్కొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటి చేయండి

- వ్యవసాయ సహాయ సంచాలకుడు డాక్టర్ సత్యనారాయణ



మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

బుక్కరాయసముద్రం: నూతన ఆవిష్కరణలతో వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ సూచించారు. బీకేఎస్ మండలం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో అత్యల్ప వర్షపాత మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు కొత్త పంటల సాగుపై రైతులను చైతన్య పరచాలన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల పాత్ర కీలకమన్నారు. నీటి సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. జింకలు, అడవి పందుల బెడద నుంచి పంటను కాపాడుకునే అంశాలపై చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ జాన్సన్, ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ విస్తరణ సంచాలకుడు డాక్టర్ శివనారాయణ, రేకులకుంట పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శంకర్‌బాబు, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్, నాబార్డ్ జిల్లా అధికారి అనూరాధ, ఉద్యాన పరిశోధనా అధిపతి డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కదిరి అర్బన్: అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ వివాహిత చేసిన ఫిర్యాదు మేరకు భర్త, ఆయన కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు కదిరి రూరల్ పోలీసులు తెలిపారు. కందికుంట కాలనీకి చెందిన తులసికి మూడేళ్ల క్రితంనల్లచెరువు మండలం దామావాండ్లపల్లికి చెందిన సాయికుమార్‌తో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఆరు నెలలుగా అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో నెల క్రితం పుట్టింటికి చేరుకుంది. అయినా భర్త, ఆయన కుటుంబసభ్యుల్లో మార్పు రాకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్త సాయికుమార్, ఆయన తల్లి లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హల్‌చల్

తనకల్లు: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో గురువారం నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హల్‌చల్ చేసింది. హోటళ్లు, బేకరీ, చికెన్ పకోడా దుకాణాలలో తనిఖీలు చేపట్టి ఒక్కో దుకాణ నిర్వాహకుడి నుంచి రూ.1,500 చొప్పున వసూలు చేసింది. అయితే ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో స్థానిక వ్యాపారులు ఆరా తీసి కదిరికి చెందిన ఆశాబీగా నిర్ధారించుకుని, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆ పేరుతో ఎవరూ లేరని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నమం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణాలకు పాల్పడినట్లుగా తెలిసింది.



మంజునాథ్(ఫైల్)



మృతుడు నరసింహప్ప

- **బత్తలపల్లి:** స్థానిక వినాయకనగర్‌లో నివాసముంటున్న మందల మంజునాథ్(32)కు భార్య సరస్వతి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రైవేట్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఈ క్రమంలో రెండేళ్లుగా షుగర్, బీపీ, థైరాయిడ్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సరస్వతి చికిత్స కోసం తన స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. సంపాదన అప్పులు చెల్లించేందుకు సరిపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం తండ్రి కింద పడి కాలు విరగడంతో అనంతపురంలోని ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స చేయిస్తున్నాడు. చేసిన అప్పులే కాక మరికొంత అప్పు చేయాల్సి రావడంతో భార్యతో చెప్పుకుని బాధపడ్డాడు. బుధవారం ఉదయం ఆస్పత్రిలో తండ్రి వద్ద భార్యను ఉంచి ఇంటికి చేరుకున్న ఆయన క్రిమి సంహారక మందు తాగాడు. అనంతరం విషయాన్ని స్నేహితులకు ఫోన్ చేసి తెలపడంతో వారు హుటాహుటినా అక్కడకు చేరుకుని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.
- **పెనుకొండ రూరల్:** కర్ణాటకలోని తుమకూరు జిల్లా పావగడ తాలుకా పలవల్లి గ్రామానికి చెందిన నరసింహప్ప(60) పెనుకొండ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలిసింది. మృతుడికి భార్య పుష్పావతి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై రైల్వే పోలసీఉలు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.